# ఎమెస్కో
# బొమ్మల భారతం

బాలబంధు
పాలంకి వెంకట రామచంద్రమూర్తి

# ఎమెస్కో బొమ్మల భారతం

## భీష్ముడు

కురువంశానికి చెందిన శంతనుడు అనేరాజు ఒకనాడు గంగానది ఒడ్డున హరిస్తూండగా అతనికొక సుందరి ఎదురైంది. అతడామె సౌందర్యానికి ముగ్ధుడై, ''జగన్మోహినీ! నిన్ను నేను పెండ్లి చేసుకోవాలని కోరుతున్నాను, అంగీకరించు'' అని ప్రార్థించాడు. ''నీవు నా షరతులకు ఒప్పుకుంటే నేను నీకు భార్యనౌతాను;


నేనెవరినో నీవు తెలుసుకోడానికి ప్రయతించకూడదు; మంచి ఐనా చెడ్డఐనా నేను చేసే పనికి అభ్యంతరం చెప్పకూడదు. అలా చెప్పిన నాడు నేను నిన్ను విడిచి వెళ్ళిపోతాను'' అన్నదామె. అతడా నియమాలకు ఒడంబడి, ఆమెను తన రాజధానియైన హస్తినాపురానికి తీసుకుపోయి, తన పట్టమహిషిగా చేసుకున్నాడు.

పిమ్మట వారికొక కూమారుడు జన్మించాడు. ఆమె ఆ శిశువును తీసుకుపోయి, గంగలో విసిరివేసి చక్కా వచ్చింది. రాజు హృదయం చివుక్కుమంది. ''కన్నబిడ్డను ఇలా చంపుకుందేమిటి? ఎవరీమె ?'' అన్న ప్రశలు ఎదురయ్యాయి. అడిగితే ఆమె తన్ను విడిచి వెళ్ళిపోతుందన్న దిగులుతో అతడు మౌనంగా ఉండిపోయాడు.

తర్వాత ఆమెకింకా పుత్రులు పుట్టేరు. పుట్టిన వెంటనే తీసుకుపోయి ఒక్కొక్కణ్ణే ఆమె గంగాపాలు చేసి వచ్చేది. శంతనుడు ప్రతీసారీ మనసులో బాధపడి ఊరుకున్నాడే కాని ''ఇదేంపని?'' అని చొరవ చేసి అడగలేక పోయాడు.


ఆవిధంగా ఆ మహాతల్లి ఏడుగురు పాపలను నీటిపాలు చేసింది. ఎనిమిదవసారి మళ్ళీ ఒక కొడుకును ప్రసవించింది. ఆ పసివాణ్ణి కూడా ఆమె నదికి తీసుకుపోతూండగా శంతనుడు ఇంక ఉండబట్టలేక ''నీవు ఆడదానివి కావా? నీకు కడుపుతీపి అనేది లేనట్లుంది.... ఏమైనా సరే. ఈ బిడ్డను ఇక్కడనుండి కదపడానికి వీల్లేదు'' అనేశాడు. ఆమె మందహాసంతో,

''రాజా! ఈ పుత్రునిపై అనురాగం మూలాన నామీద నీకు మోజు తగ్గిందన్నమాట. నేను పెట్టిన షరతు మాట మరచి పోయి నా అభీష్టానికి అభ్యంతరం చెప్పేవు. ఇంక నేను నిన్ను విడిచి వెడతాను....వెళ్ళేముందు, నా వింత ప్రవర్తనకు కారణం చెప్పి వెడతాను. చెప్పకుండా వెడితే నాకీ అపఖ్యాతి ఇలాగే ఉండి పోతుంది.



నీవు పూర్వం.... ఎన్నో పుణ్యకార్యాలు చేసి బ్రహ్మలోకంలో వసించే అర్హత సంపాదించు కొన్న....
'మహాభిషుడు' అనే రాజువు. నేను గంగాదేవిని. ఒకనాడు నీవు చతుర్ముఖుని సభలో నన్ను చూసి మోహానికి వశుడవయ్యావు. నేనుకూడా నిన్ను ప్రేమతో వీక్షించడం గమనించిన విధాత, ''నాసభలోనా మీ ప్రేమాకలాపం? అంటూ ఆగ్రహించి, ''మీరు ఉభయులూ పోయి భూమిపై జన్మించండి అని శపించాడు....నేను నిన్ను కలుసుకోడానికి ఇక్కడకు వస్తూండగా మార్గమందు ఎనమండుగురు దివ్యపురుషులు నాకు ఎదురై సాష్టాంగ పడ్డారు. ''లేవండి ఎవరు మీరు ?'' అని నేను అడుగగా వారిలో పెద్దవాడు, ''గంగాభవానీ. మేము అష్టవసువులం. మా భార్యలతో మేము విహారానికని బయలుదేరి, వసిష్ఠాశ్రమం వైపు వెళ్ళడం తటస్థించింది. అప్పుడు ఆశ్రమంలో వసిష్ఠ మహర్షి లేడు. ఆయన తపస్సుకు కావలసిన వస్తుసంచయాన్ని సమకూర్చే నందినీ ధేనువును మాలో ఆఖరువాడైన ప్రభాసుని అర్ధాంగి చూసి ముచ్చట పడింది; తనకా సౌర భేయికావాలన్నదామె. ''మహర్షి సొత్తును మనం ఆపేక్షించరాద''ని

మేము ఎంతచెప్పినా ఆమె వినలేదు. ఆమెముద్దు చెల్లించాలన్న అభిలాషతో మా ప్రభాసుడు నందినీధేనువును పట్టుకోబోయాడు. శక్తి సంపన ఐన ఆ ధేనువు ప్రభాసునకు లొంగకపోవడం చూసి మేము ఏడుగురమూ పోయి వానికి తోడ్పడి ఆ గోవును బలవంతంగా తీసుకు పోయాము. మహర్షి ఆశ్రమానికి తిరిగివచ్చి సంగతి తెలుసుకొని, ''చోరత్వమునకు పూనిన మీరు దేవతలుగా ఉండతగరు, భూమిమీద పుట్టండి పోయి'' అని శపించాడు. అప్పుడు ఆయనను మేము, ''మానవులమై మనలేము. శాపమోచనానికి మార్గం తమరే అనుగ్రహించాలి.'' అని బ్రతిమాలాము. ''మీలో ఎక్కువ అపరాధం చేసిన ప్రభాసుడు చిరకాలం నరుడై ఉండక తప్పదు. వాని అన్నలు మీరు ఏడుగురూ మనుజులై పుట్టిన వెంటనే ఆ జన్మము చాలించే మార్గము చూసుకొని, తిరిగి నా లోకాన్నిచేరుకోండి'' అని సెలవిచ్చాడు.... నీవు శంతనుని రాణివి కావడానికి వెడుతునావు. మేము ఎనమండుగురమూ మీకు సుతులమై జన్మిస్తాము. మా ఏడుగురకూ విముక్తి కలిగించడానికి పుట్టిన వెంటనే మమ్ము నదిలో ముంచివెయ్యమని నిన్ను



ప్రార్థిస్తున్నాము..... కడుపుతీపి అన్నది ప్రతిస్త్రీకి సహజం కనుక మమ్మలి చంపివెయ్యడమంటే నీకు మనస్కొప్పదు కాని పరోపకారపరాయణివగు నీవు మా ప్రార్థనను అంగీకరించాలి. మా అందరిపైనా చూపవలసిన నీ మాతృవాత్సల్యాన్ని మా ప్రభాసుని పైన చూపు'' అన్నారు...వారు అలాబ్రతిమాలుతుంటే నేను కాదనలేకపోయాను. వారికోర్కె ప్రకారం ఆ మొదటి ఏడుగురికీ అలా విమోచనం కలిగించవలసి వచ్చింది. అష్టమగర్భమైన ఈ శిశువును పెంచి పెద్దవాణ్ణి చేస్తాను. విద్యాబుద్ధులు గరపించి నీవశం చేస్తాను '' అంటూ ఆమె ఆ బిడ్డతో అదృశ్యమైంది.

గంగా సుందరి వెడలిపోయాక శంతనుడు విరక్తితో మరి వివాహం మాట తలపెట్టక రాచకార్యములందు నిమగ్నుడై కాలం వెళ్ళబుచ్చుతున్నాడు. ఇరవై నాలుగు సంవత్సరాలలా గడచిపోయాయి. ఒకనాడాతడు మందాకినీ తీరమమ్మట పోతూండగా యువకుడొకడు తన విల్లు నుండి వదిలిన బాణ పరంపరతో ప్రవాహానికిడ్డంగా ఆనకట్టను నిర్మిస్తూ కనబడ్డాడు. ఆ ధనుర్ధరుని చాతుర్యాన్ని చూసి ఆశ్చర్యపోతూన్న శంతనుని ఎదుట గంగాదేవి ప్రత్యక్షమై ''రాజా! వీడే మన పుత్రుడు, వీనికి 'దేవవ్రతుడు' అని నామకరణం చేశాను. వశిష్ఠుని చేత వేదములూ, శాస్త్రములు అధ్యనం చేయించాను. పరశురాముని చేత ధనుర్విద్య నేర్పించాను. సకల విద్యా విశారధుడైన వీడింక నీకు చేదోడువాదోడుగా ఉండగలడు'' అని తనయుణ్ణి తండ్రికి అప్పగించి తాను బ్రహ్మలోకానికి వెడలిపోయింది. శంతనుడు దేవవ్రతుణ్ణి తనతో తీసుకొని వెళ్ళి, యువరాజుగా పట్టాభిషక్తుణ్ణి చేశాడు.

దేవవ్రతునకు ''శాంతనవుడూ'' గాంగేయుడు'' అన పేర్లు కూడా వచ్చాయి. నాలుగు సంవత్సరాలు తరువాత శంతనుడు ఒకనాడు తన రథంపై యమునా నది వైపు వెడుతునాడు. తామరపూవు సువాసన వంటి పరిమళం సోకగా, ఆ సౌరభం వస్తున్న వైపు వీక్షించాడు. తీరాన నావలో చక్కని చుక్క ఒక జవ్వని కనబడింది. ఆ పద్మగంధి సౌందర్యం శంతనుని వైరాగ్యాన్ని పటాపంచలు చేసింది. ''హరిణేక్షణా, నీవెవ్వరవు?'' అని ప్రశించగా ఆమె ''నేను ఉపరి శరవశుడు'' అను రాజు కుమార్తెను. నా తల్లిదండ్రులు నా బాల్యమందే గతించుటచే నన్ను దాశరాజు అను బెస్తల నాయకుడు పెంచాడు. ఆయన ఈ పడవలో యాత్రికులను దాటించడానికి నన్ను నియమించాడు, నాకు ''సత్యవతి'' అని నామకరణం జరిగినా ''యోజన గంధి'' అన పేరు కూడా వచ్చింది. పరాశరుడను మహర్షి ప్రసాదించిన వరం వల్ల నాకీ పరిమళం అబ్బింది'' అన్నది.